VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ సోమవారం 15 సెప్టెంబర్ 2025
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 47
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## భారత్ అదరహో...

### ఆసియా కప్.. పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించిన

దుబాయ్: భారత్ అదరహో.. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై మళ్లీ మనదే ఆధిపత్యం. ఆసియా కప్ 2025లో భాగంగా దాయాది జట్టుతో జరిగిన మ్యాచ్‌లో టీమ్ఇండియా 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్‌ను 127/9కే కట్టడి చేసింది. కుల్‌దీప్ యాదవ్ (3/18), అక్షర్ పటేల్ (18/2), బుమ్రా (28/2) బంతితో అదరగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన టీమ్ఇండియా 128 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని 15.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. సూర్యకుమార్ యాదవ్ (47లిబీ 37 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), తిలక్ వర్మ (31బీ 31 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఓపెనర్ అభిషేక్ శర్మ (31బీ 13 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు బౌండరీలతో అలరించాడు.



## హైదరాబాద్ నగరంలో భయంకరమైన వర్షం..

హైదరాబాద్ : రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో భయంకరమైన వర్షం కురిసింది. ఆదివారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి నగరం అతలాకుతలమైంది. నగరంలోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. పలు చోట్ల భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. షేక్‌పేట, మణికొండ, నార్సింగి, గచ్చిబౌలి, నానక్‌రామ్‌గూడ, రాయ్‌దుర్గ్, టోలీచౌకీ, మెహిదీపట్నం, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి, నాంపల్లి, అబిడ్స్, గోషామహల్, కూకట్‌పల్లి, అమీర్‌పేట్, సనత్‌నగర్, మాదాపూర్, హైటెక్‌సిటీ, బేగంపేట్, సికింద్రాబాద్, తార్నాక, రాంనగర్, నాచారం, అంబర్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్, హయత్‌నగర్, సంతోష్ నగర్, చార్మినార్, ఉప్పుగూడ, జియగూడతో పాటు తదితర ప్రాంతాల్లో వాన దంచికొట్టిందిరాత్రి 8 గంటల వరకు అందించిన సమాచారం మేరకు మల్కాజిగిరి ఈస్ట్ ఆనంద్ బాగ్‌లో 5.53 సె.మీ, నేరెడ్‌మెట్‌లో 5, బండ్లగూడలో 4.75, మల్లాపూర్‌లో 4.2, నాచారంలో 4.13, ఉప్పల్ చిలుకానగర్‌లో 3.85 సె.మీ. వర్షపాతం నమోదైంది.



### యూరియా కోసం క్యూలైన్‌లో నిల్చున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్: కాంగ్రెస్ పాలనలో యూరియా కోసం అన్నదాతలు అరిగోస పడుతున్నారు. నెలల తరబడి కేంద్రాల చుట్టూ తిరిగినప్పటికీ ఒక్క బస్తా కూడా దొరకడం లేదు. దీంతో యూరియా ఇస్తారనే సమాచారం తెలిసిన వెంటనే కేంద్రాలకు వెళ్లి అర్ధరాత్రి నుంచే పడిగాపులు కాస్తున్నారు. ఈ క్రమంలోనే మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌కు కూడా యూరియా తిప్పలు తప్పలేదు. ఆమె కూడా యూరియా కోసం క్యూలైన్‌లో గంటల తరబడి వేచివున్నారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం పెద్దతండాలో సత్యవతి రాథోడ్‌కు ఐదున్నర ఎకరాల భూమి ఉంది. దానికోసం యూరియా బస్తాల కోసం ఆమె గుండ్రాతిమడుగు రైతు వేదిక వద్దకు ఆదివారం నాడు వచ్చారు. యూరియా బస్తాల కోసం క్యూలైన్‌లో నిల్చున్నారు. తీరా ఆమె లైన్ వచ్చేసరికి ఒక్క బస్తా మాత్రమే అధికారులు ఇచ్చారు. దీనిపై మంత్రి సత్యవతి రాథోడ్ అసహనం వ్యక్తం చేశారు. ఐదున్నర ఎకరాల భూమికి ఒక్క బస్తా మాత్రమే ఎలా సరిపోతుందని ప్రశ్నించారు.

## జూబ్లీహిల్స్‌లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



"నియోజకవర్గంలో సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న భరోసా కల్పించాలి. కాంగ్రెస్‌తోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుంది. అభ్యర్థి ఎంపిక విషయం ఏఐసీసీ చూసుకుంటుంది. పార్టీ గెలుపు కోసం పనిచేయాల్సిన గురుతర బాధ్యత మీపైనే ఉంది. మీ పనితీరుతో పాటు క్షేత్రస్థాయి పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుంటున్నా. జూబ్లీహిల్స్‌లో పార్టీ గెలుపే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలి"

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అంశానికి సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి తన నివాసంలో సమీక్ష చేపట్టారు. ఆదివారం(సెప్టెంబర్ 14వ తేదీ) జూబ్లీహిల్స్ ఎన్నికపై పలువురు కాంగ్రెస్ నేతలతో చర్చిస్తున్నారు. దీనికి పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, జూబ్లీహిల్స్ ఇంచార్జ్ మంతరులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్‌లతో సర్వే ఏజెన్సీల నుంచి పలువురు హాజరయ్యారు. ఈ నెలాఖరులో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్
వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి పనులు , అభ్యర్థి ఎంపిక పై మంత్రులతో సీఎం చర్చిస్తున్నారు. జూబ్లీహిల్స్ రేసులో నవీన్ యాదవ్, బొంతు రామ్మోహన్, అంజన్ కుమార్ యాదవ్‌లు పోటీలు ఉన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికపై సీక్రెట్ సర్వే రిపోర్ట్‌ను సీఎంకు అందజేశారు పీసీసీ చీఫ్‌దీనిలో భాగంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ' జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపు కోసం ప్రతీ ఒక్కరు పని చేయాలి. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలి. పోలింగ్ బూత్‌ల వారీగా ప్రచార ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. నియోజకవర్గంలో సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న భరోసా కల్పించాలి. కాంగ్రెస్‌తోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గ
అభివృద్ధి సాధ్యమవుతుంది. అభ్యర్థి ఎంపిక విషయం ఏఐసీసీ చూసుకుంటుంది పార్టీ గెలుపు కోసం పనిచేయాల్సిన గురుతర బాధ్యత మీపై ఉంది.



## 'చోటే భాయ్'ని కాపాడుతున్న 'బడే భాయ్'..



హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ సొరంగం ఘటన జరిగి 200 రోజులు దాటినా కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగురి మృతదేహాలను కూడా వెలికితీయలేకపోయింది. ఇంకా కుటుంబాలకు ఎలాంటి పరిహారం కూడా చెల్లించలేదంటూ ఎక్స్ వేదికగా నిలదీశారుకాళేశ్వరం ప్రాజెక్టులో చిన్నపాటి సమస్యలకే జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందాన్ని పంపించి హంగామా సృష్టించిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. ఎస్ఎల్‌బీసీ ఘటనపై దర్యాప్తు చేయడానికి ఎందుకు ఒక్క బృందాన్ని కూడా పంపలేదంటు కేటీఆర్ ప్రశ్నించారు. బీజేపీ బడే భాయ్ ఎందుకు తెలంగాణలో కాంగ్రెస్ చోటే భాయ్‌ని కాపాడుతున్నారంటూ దుయ్యబట్టారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చిన రోజున,
ఆ ఆరు కుటుంబాలకు
న్యాయం జరిగేలా చూస్తాం.
ఆ ఆరుగురి ప్రాణాలను బలిగొన్న వారికి శిక్ష పడేలా చేస్తాం.
కాంగ్రెస్ విధ్వంసం చేసిన ప్రతి దానితో పాటు ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోవడానికి గల కారణాలకు మేము సమాధానాలు రాబడతాం" అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## 'నేను శివభక్తుణ్ని.. ఆ విషాన్ని నేను హరించేస్తా'

దిస్పూర్: తనపై,తన తల్లి హీరాబెన్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తున్న కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను శివభక్తుణ్ని.. కాంగ్రెస్ విమర్శల విషాన్ని హరించేస్తా'అని స్పష్టం చేశారు. ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ అసోంలో దరంగ్ జిల్లాలో ఆదివారం వేలకోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడారు. 'నేను ఇలా మాట్లాడితే మోదీ మమ్మల్ని టార్గెట్ చేస్తున్నారని కాంగ్రెస్ విమర్శలు చేస్తుంది. నన్ను ఎంత దూషించినా పట్టించుకోను. ఎందుకంటే నేను శివుని భక్తుడిని.. విమర్శల విషాన్ని హరించేస్తా. నా రిమోట్ కంట్రోల్ వాళ్లేకానీ దేశ ప్రజలపై దాడి చేస్తే మాత్రం మౌనంగా ఉండను. ప్రజలే నా దేవుళ్లు. నా బాధను వాళ్ల ముందు వ్యక్తం చేయకపోతే .. ఎవరి ముందు చేస్తాను. అందుకే వాళ్లే నా యజమానులు, నా దేవతలు, నా రిమోట్ కంట్రోల్. నాకు వేరే రిమోట్ కంట్రోల్ లేదు' అని స్పష్టం చేశారుచర్చకు దారితీసిన మోదీ రిమోట్ కంట్రోల్ వ్యాఖ్యలు ?అయితే, అస్సాం సభలో ప్రధాని మోదీ మరోసారి'రిమోట్ కంట్రోల్' వ్యాఖ్యలు చర్చకు దారి తీశాయి. గతంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను అప్పటి యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ రిమోట్ కంట్రోల్ చేశారని మోదీ ఆరోపించారు.

## మరో పోరాటం తప్పదు..

హైదరాబాద్:రెండేళ్లుగా రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని విద్యాసంస్థల యాజమాన్యాలు మొత్తుకుంటున్నా రేవంత్ సర్కారు మొద్దు నిద్ర నటిస్తుండటం సిగ్గుచేటు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై పోరుబాట అంటూ పీడీఎస్‌యూ రూపొందించిన బిగ్ డిబేట్ పోస్టర్‌ను హైదరాబాద్‌లోని తన నివాసంలో హరీశ్‌రావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, పీజీ, ఫార్మసీ, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ, ఇంజినీరింగ్ విద్యాసంస్థలు మూతపడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 13 లక్షల విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందని అన్నారు. సెమిస్టర్ పరీక్షలు కూడా వాయిదా వేసే పరిస్థితి వస్తుంటే విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి ఏం చేస్తున్నట్లు అని నిలదీశారు. సోమవారం నుంచి నిరసనలు, నిరాహార దీక్షలు, నిరవధిక బంద్‌లు చేయనున్నట్లు ప్రకటించినప్పటికీ ఎందుకు నోరు మెదపడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు నిలదీశారు. 'అల్లరి చేయొద్దు' అని ఆర్థిక మంత్రి సుద్దులు చెప్పినంత మాత్రాన యాజమాన్యాలు, విద్యార్థుల గోడు తీరదని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు
జీతాలు, ఫీజు రీయింబర్స్
ఇవ్వడానికి లేని డబ్బులు ముఖ్యమంత్రి కమిషన్ల ప్రాజెక్టులకు ఎలా వస్తున్నాయి? అని ప్రశ్నించారు. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు డీఏలు ఇవ్వమంటే
'నన్ను కోసుకొని తిన్న పైసలు లేవు' అని చెప్పిన ముఖ్యమంత్రి లక్షల కోట్ల టెండర్లు ఎలా పిలుస్తున్నాడు? అని నిలదీశారు.



వేగుచుక్క

# విద్యతోనే వడ్డేరుల జీవితాల్లో మార్పు.




**గ్రామస్థాయి నుండి సంఘం బలోపేతం.**

**ఐక్యంగా ఉంటేనే మన హక్కులు.**

**వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు పిట్ల శ్రీధర్.**



వేగుచుక్క న్యూస్, హైదరాబాద్: విద్యతోనే వడ్డేరుల జీవితాల్లో మార్పు సాధ్యం అని, తమ పిల్లలను కచ్చితంగా చదివించాలని వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు పిట్ల శ్రీధర్ అన్నారు. ఐక్యంగా ఉంటేనే మన హక్కులు దక్కుతాయని, గ్రామస్థాయి నుండి సంఘం బలోపేతం చేయాలనీ ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్, అత్తాపూర్ లోని జాతీయ వడ్డెర సంఘం కార్యాలయంలో జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షులు పిట్ల శ్రీధర్ పలువురికి సంఘ బాధ్యతలు అప్పగిస్తూ నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు వల్లెపు శివకుమార్, జాతీయ గౌరవాధ్యక్షులు రూపాని లోకనాథం, జాతీయ కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య, జాతీయ యువజన అధ్యక్షులు వేముల భరత్, జాతీయ సహకార్యదర్శి పల్లపు రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిట్ల శ్రీధర్ మాట్లాడుతూ, జాతీయ వడ్డెర సంఘం ప్రతి వడ్డెర బిడ్డ కు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందాలని, ప్రతి వడ్డెరకు సామాజిక భద్రత కలిగించాలని, ఆర్థికంగా, రాజకీయం గా వడ్డేరులు ఎదగాలి అనే అంశాలపైన పోరాటం చేస్తుందని అన్నారు.

ప్రభుత్వం నుండి ఇవన్నీ మన వడ్డెరలకు సమకూరాలంటే గ్రామీణ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు మనందరం కూడా మన వారిని చైతన్య పరుస్తూనే, వడ్డెర ప్రజల పక్షాన పోరాటం చేయాలని అన్నారు.

**సంఘం బాధ్యతలు తీసుకున్న వారు.**

జాతీయ మహిళా సంఘం ఉపాధ్యక్షురాలుగా చెంబేటి విజయలక్ష్మి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా వేముల భవాని, గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలుగా మక్కల ధనలక్ష్మి, జాతీయ వడ్డెర సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులుగా బోదాసు రవి, రాష్ట్ర కార్యదర్శిగా దేరంగుల రామచంద్రయ్యను నియమించారు.



## పంచలోహ "వారాహి మాత" విగ్రహానికి ఘన పూజ.

**కర్ణాటకలోని శృంగేరి సన్నిధానంలో....**

**పాల్గొన్న ఆలయ ట్రస్ట్ చైర్మన్ మంచాల జ్ఞానేందర్.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**



నగరంలోని అమ్మ వెంచర్స్‌లో నిర్మాణం జరుగుతున్న శ్రీ వారాహి మాత దేవాలయం భక్తులకు ఆధ్యాత్మిక క్షేత్రంగా రూపుదిద్దుకుంటోంది. ఈ ఆలయంలో ప్రతిష్టించబోయే పంచలోహ విగ్రహంకు కర్ణాటకలోని శృంగేరి శారదా పీఠంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ పూజా మహోత్సవం జగద్గురు శృంగేరి శారదా పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ భారతి తీర్థ మహాస్వామి వారి దివ్య సన్నిధానంలో, అలాగే జగద్గురు శ్రీ శ్రీ విధుశేఖర భారతి మహాస్వామి వారి ఆశీస్సులతో పవిత్రంగా జరిగాయి. ఈ మహోత్సవంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ మంచాల జ్ఞానేందర్ పాల్గొని దైవ కృపను పొందారు. ఆలయ నిర్మాణం సమయానికి పూర్తి అవ్వాలని, ఈ క్షేత్రం భక్తుల ఆధ్యాత్మిక చైతన్యానికి కేంద్రబిందువుగా నిలవాలని స్వాములు ఆశీర్వదించారు. ఈ పూజా మహోత్సవంలో మరుమాముల వెంకట రమణ శర్మ, శాస్త్రుల వెంకటేశ్వర శర్మ, పురాణం మహేశ్వర శర్మ, వేగేటి పశుపతినాథ శర్మ, తుండ్ల కమలాకర శర్మ,మంచాల జ్ఞానేందర్ తదితరులు పాల్గొన్నారు.

## భారత్,చైనాలపై టారిఫ్‌ల విధించండి

వాషింగ్టన్: రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై భారీగా టారిఫ్‌లను విధించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనకు ఐరోపా సమాఖ్యతో పాటు–, జి 7 దేశాలు అంగీకరించినట్లు– తెలుస్తుంది. ఉక్రెయిన్‌లో శాంతి పునరుద్ధరణ చేయాలని, అందుకోసం రష్యాపై ఒత్తిడి తేవడమే సరైన మార్గం అని అందులో భాగంగా రష్యా చమురును కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై భారీ టారిఫ్‌లు విధించాలని అమెరికా ప్రతిపాదించింది. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో జి 7 దేశాలు సమావేశమయ్యాయి. ఈ భేటీలో సుంకాల విధింపుపై చర్చ సాగింది. ఈ సందర్భంగా అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్ మాట్లాడుతూ ... ఇప్పటికే భారత దిగుమతులపై అమెరికా భారీ సుంకాలు విధించిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ క్లిష్ట సమయంలో నిర్ణయాత్మక చర్య తీసుకోవడానికి జీ 7 దేశాలు ముందుకురావాలని కోరారు. అందుకు జి 7 దేశాలు స్పందిస్తూ ... యుద్ధం ముగింపునకు కట్టు–బడి ఉన్నామని ప్రకటించాయి. రష్యాపై ఒత్తిడి తేవడానికి ఇంతకుముందు ఐరోపా సమాఖ్య (ఈయూ) దేశాల ముందు కూడా ట్రంప్ ఇలాంటి ప్రతిపాదనలే చేశారు. అయితే, ఈ విషయంలో ఈయూ దేశాల్లో భిన్నాభిప్రాయలు వ్యక్తమయ్యాయి. దీంతో అది సాధ్యపడలేదు. ఇవే ప్రతిపాదనలను ఆయన మళ్లీ జి 7 దేశాల ముందుపెట్టడం గమనార్హం. ఇప్పుడు కూడా టారిఫ్‌ల విధింపుపై ఐరోపా సమాఖ్య దేశాల నుంచి భిన్నాభిప్రాయలు వ్యక్తమయ్యాయి. ఫలితంగా అది ఇంకా సాధ్యపడలేదు.

ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు రష్యా (షశ)పై ఒత్తిడి తేవడమే సరైన మార్గమని అమెరికా భావిస్తోంది. అందులో భాగంగా ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలను లక్ష్యంగా చేసుకోవాలని చూస్తోంది. ఈక్రమంలో ఈయూ, జీ7 దేశాలు భారత్, చైనా లపై టారిఫ్‌లు విధించాలని ట్రంప్ పాలకవర్గం ప్రతిపాదనలు చేసింది. ఇందుకు జీ7 సభ్య దేశాలు కూడా సానుకూలంగా స్పందించినట్లు– తెలుస్తోంది.

# ఘనంగా "బహుజన బతుకమ్మ" పాట ఆవిష్కరణ.









**"ప్రకృతి రక్షణే- ప్రజల రక్షణంటూ" గళమెత్తిన విమలక్క.**

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్:**

"ప్రకృతి రక్షణే– ప్రజల రక్షణంటూ" అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రూపొందించిన బహుజన బతకమ్మ– 2025 పాట ఆవిష్కరణ కార్యక్రమం ప్రసాద్ ల్యాబ్స్ లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అరుణోదయ విమలక్క అధ్యక్షత వహించగా, హైదరాబాద్ హైకోర్టు విశ్రాంత జస్టిస్ రాధా రాణి ముఖ్యఅతిథిగా, విశ్రాంత ఆచార్యులు జయదేవ్ తిరుమలరావు ప్రధానోపాన్యాసం చేశారు. బహుజన బతుకమ్మ గురించి విశ్రాంత ఆచార్యులు కే.లక్ష్మీ వివరించారు. సభకు హాజరైన ప్రముఖులంతా అభివాదం చేసి, పాట ఆవిష్కరణ ముందు అమరులకు జోహార్లు తెలుపుతూ సభ మౌనం పాటించింది. రాజేంద్రప్రసాద్ జీవిత సహచరి యాలవర్తి ధనలక్ష్మి పాటను ఆవిష్కరించారు. బహుజన బతుకమ్మ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ లక్ష్మి బహుజన బతుకమ్మ ఏర్పాటును, దాని ఉద్యమ కార్యచరణను, 15 సంవత్సరాలుగా ఎత్తి పడుతున్న ఉద్యమ నినాదాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమం కొందరికే పరిమితమైంది కాదని, విమలక్క సబ్బండ ప్రజలను కలిపే ప్రయత్నం చేస్తుందనీ అన్నారు. నేడు ప్రకృతి విధ్వంసాలు ఎక్కడ జరిగిన వాటికి కారణం మానవ తప్పిదాలే అని గుర్తు చేశారు. పంట భూముల్ని వెంచర్లుగా మార్చటం, ప్లాస్టిక్ పూలను పెంచి పోషించుట వల్ల పర్యావరణం దెబ్బతింటుందన్నారు.

**ప్రొఫెసర్ జయదేవ్ తిరుమల్ రావు మాట్లాడుతూ,**

15 సంవత్సరాల బహుజన కార్యక్రమాలను ప్రశంసించారు. పాలకవర్గాలు హైజాక్ చేసిన బతుకమ్మ విశ్రాంతిలో ఉంటే ప్రజల బతుకమ్మ జనం కోసం శ్రమిస్తూనే ఉందన్నారు. అదిలాబాద్ జిల్లా తాంసి గ్రామంలో కేవలం ఐదుగురు మహిళలు కమిటీగా ఏర్పడి వాడ వాడ దళితులను బతుకమ్మ కార్యక్రమంలో కలుపుతున్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఏ.కే ప్రభాకర్ ఈ సంవత్సరం వచ్చిన బతుకమ్మ పాటపై విశ్లేషిస్తూ సాంప్రదాయిక పదాలను తెరదించి, శ్రమజీవుల పదజాలాన్ని పలకించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మరికొందరు ప్రముఖులు మాదాల రవి, అంబటి నాగన్న, తొలివెలుగు రఘు, జ్యోత్స్న, భద్ర, రఫీ, పిడిఎస్ యు పూర్వ నాయకుడు శీను, సోగరా భేగం, నాగిరెడ్డి, రఘునందన్, మల్లేష్, కస్తూరి శ్రీను, యాదగిరి, సైర్వ భాను, అనంతడుపుల నాగరాజు, దుచ్చర్ల సత్యనారాయణ, భరత్, పృధ్వీరాజ్ , పాశం యాదగిరి మొదలైన వారు ఉపాన్యసించారు. విప్లవ కవి రచించిన పాటను విమలక్క, అనిత, రాకేష్ ఆలపించగా, అరుణోదయ బృందం కోరస్ అందించగా, పాట–వీడియో రూపకల్పన ప్రేక్షకులను ఆకట్టుకుంది.

# తొలి జాతీయ మహిళా సాధికారత సదస్సు..

## హాజరు కాని చంద్రబాబు




తిరుపతి: వేదికగాల జాతీయ మహిళా సాధికారత సదస్సు ప్రారంభమైంది. ఆదివారం నుంచి రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నేతృత్వంలో 'వికసిత్ భారత్‌కు మహిళల నాయకత్వం' అనే నినాదంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. అయితే చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారు. వాతావరణం అనుకూలించకపోవడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుపతి పర్యటన రద్దయ్యింది. ఈ సదస్సులో చట్టసభల్లో మహిళా ప్రజాప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నారు. పార్లమెంట్ మాత్రమే కాక దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన సుమారు వంద మంది మహిళా ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమానికి విచ్చేశారు. లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా నేతృత్వంలో ఈ కార్యక్రమం మొదలయ్యింది. 'వికసిత్ భారత్‌కు మహిళల నాయకత్వం' అనే నినాదంతో ఈ సదస్సును నిర్వహించబోతున్నారు. దీనికి ముఖ్యఅతిథిగా ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. తిరుపతి నగరంలోని రాహుల్ కన్వెన్షన్‌లో రెండు రోజుల పాటు ఈ జాతీయ సదస్సు కొనసాగనుంది.

ఈ సదస్సుల్లో చట్టసభల్లో మహిళా ప్రజాప్రతి నిధులకు ఎదురవుతున్న సమస్యలు, సవాళ్లు, ఇబ్బందులు ఏంటి.. వాటిని అధిగమించడంలో మహిళా సాధికారత పాత్రపై ఈ సదస్సులో చర్చించనున్నారు. ఈ కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, దగ్గుబాటి పురందేశ్వరి, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కూటమి నేతలు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సదస్సుకు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, మంత్రి పయ్యావుల కేశవ్, పార్లమెంట్ కమిటీ (మహిళా సాధికారత) ఛైర్‌పర్సన్ దగ్గుబాటి పురందేశ్వరితో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూటమి నేతలు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సదస్సు అనంతరం వారు చంద్రగిరి కోటను సందర్శించనున్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారు. ఈ సదస్సులో పాల్గొనడం కోసం ఆయన నేడు తిరుపతి రావాల్సి ఉంది. అయితే చివరి నిమిషంలో చంద్రబాబు తిరుపతి పర్యటన రద్దయింది. వాతావరణం అనుకూలంగా లేకపోవడం

వల్ల చంద్రబాబు పర్యటన రద్దయినట్లు అధికారులు తెలిపారు. అమరావతి–తిరుపతి మధ్య ఆకాశంలో దట్టమైన మేఘాలు అలముకొని ఉండటంతో ఏవియేషన్ అధికారులు చంద్రబాబు పర్యటనకు క్లియరెన్స్ ఇవ్వలేదు. దీంతో ఆయన పర్యటన రద్దయింది. దీంతో ఆయన తిరుపతిలో నిర్వహిస్తున్న మహిళా సాధికారత సదస్సులో పాల్గొనడం లేదు.

తమ ప్రభుత్వం మహిళా సాధికారత సాధించేందుకు అనేక స్కీములు తీసుకొచ్చిందని.. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. బేటీ బచావో–బేటీ పడావో, మహిళా సమ్మాన్ నిధి సహా అనేక పథకాలు అమలు చేస్తుందని చెప్పుకొచ్చారు. జాతీయ తొలి మహిళా సాధికారత సదస్సులో పురందేశ్వరి మాట్లాడుతూ.. అనేక మంది మహిళలు సామాజిక అడ్డంకులను అధిగమించి మరీ స్వతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. అలానే మహిళలు ఏళ్ల నుంచి విద్య, రాజకీయ, ఆర్థిక, సమానత్వం కోసం పోరాడుతున్నారని చెప్పుకొచ్చారు.

వేగుచుక్క

# అయోధ్య, వారణాసికి టూర్ ప్యాకేజీలు..



తెలంగాణ: టీజీఎస్ఆర్టీసీ సేవలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని విలేజ్, కాలనీ బస్ ఆఫీసర్లకు సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ పిలుపునిచ్చారు. సామాజిక బాధ్యతగా ప్రారంభించిన 'యాత్రాదానం' ప్రాధాన్యతను వివరించాలని అలాగే పెళ్లిళ్లు, శుభకార్యాలకు బస్సుల బుకింగ్, కార్గో సేవలను ప్రోత్సహించాలని ఆయన సూచించారు. శనివారం బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి విలేజ్, కాలనీ బస్ ఆఫీసర్ల సమావేశంలో సజ్జనార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో డిపోకు ముగ్గురు చొప్పున బస్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

విలేజ్, కాలనీ బస్ ఆఫీసర్లు తమ ప్రాంతాల్లో ప్రత్యేకమైన, శుభ సందర్భాలలో యాత్రాదానంలో భాగంగా అనాథలు, నిరాశ్రయులైన వృద్ధులు, దివ్యాంగులు, విద్యార్థులను పుణ్యక్షేత్రాలు లేదా పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సజ్జనార్ సూచించారు. యాత్రాదానం కార్యక్రమానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 21 వేలకు పైగా అద్దె బస్సులు బుక్ చేసినందుకు విలేజ్, కాలనీ బస్ ఆఫీసర్ల పనితీరును సజ్జనార్ ప్రశంసించారు. రాబోయే బతుకమ్మ, దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి పండుగలకు కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు.

టీజీఎస్ఆర్టీసీ ఇటీవల ప్రవేశపెట్టిన టూర్ ప్యాకేజీలకు మంచి స్పందన లభిస్తోందని.. త్వరలోనే అయోధ్య, వారణాసి వంటి పుణ్యక్షేత్రాల టూర్ ప్యాకేజీలను కూడా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు తెలిపారు. ఉద్యోగుల నిబద్ధత, అంకితభావం వల్లే సంస్థ ప్రజల ఆదరాభిమానాలను చూరగొంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతి గడపకు ఆర్టీసీ సేవలను తీసుకెళ్లడమే విలేజ్, కాలనీ బస్ ఆఫీసర్ల ప్రధాన లక్ష్యం. వీరు తమ పరిధిలోని గ్రామాల్లో, కాలనీల్లో ప్రజలతో నిరంతరం సంప్రదిస్తూ ఉంటారని.. బస్సుల రాకపోకలు, సమయాలు, కొత్త రూట్లు వంటి సమాచారాన్ని సేకరించి, వాటిని ఉన్నతాధికారులకు చేరవేస్తారన్నారు. అలాగే, శుభకార్యాలు, జాతరల వంటి వాటికి అద్దె బస్సులను బుక్ చేసుకోవాలని ప్రజలకు వివరిస్తారన్నారు. క్షేత్రస్థాయి సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకొచ్చి, వాటి పరిష్కారానికి కృషి చేస్తారని సజ్జనార్ వెల్లడించారు. ఈ సమావేశంలో ఈడీలు మునిశేఖర్, వెంకన్న, సోలోమన్, ఖుర్షోషాఖాన్, రాజశేఖర్, సీటీఎంలు శ్రీదేవి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం కట్టుబడి ఉందని, పెండింగ్ అంశాలను దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు సజ్జనార్ హామీ ఇచ్చారు.

# అలా చేస్తే 8 రోజుల జైలు శిక్ష

హైదరాబాద్: నగరంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు జీహెచ్ఎంసీ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. రోడ్లపై చెత్త వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ' స్పెషల్ డ్రైవ్' పేరుతో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా.. రోడ్డు మీద చెత్త వేస్తే చట్టంలోని సెక్షన్ల ప్రకారం 8 రోజుల జైలు శిక్ష పడే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బోరబండ పోలీసులు గత రెండు రోజుల్లో రోడ్లపై చెత్త వేసిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై ఛార్జిషీటు దాఖలు చేసి న్యాయమూర్తి ముందు హాజరుపరచగా.. న్యాయమూర్తి వారికి రూ.1000 చొప్పున జరిమానా విధించారు. ఈ కేసు ఒక హెచ్చరికగా ఉంటుందని.. ఇకపై చెత్త వేసే వారిపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని పోలీసులు తెలిపారు. హైదరాబాద్ నగరంలో చెత్త సమస్య తీవ్రంగా ఉంది. రోడ్లపై, నాలాల్లో చెత్త వేయడం వల్ల పర్యావరణ సమస్యలు, డెంగ్యూ వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వర్షాకాలంలో



మురుగునీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఈ సమస్యను ఎదుర్కోవడానికి పోలీసులు, జీహెచ్ఎంసీ సంయుక్తంగా ఈ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న జరిమానాలు తక్కువగా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భవిష్యత్తులో జరిమానాను పెంచే అవకాశం ఉందని మొదటిసారి పట్టుబడిన వారికి జరిమానా, రెండోసారి అదే తప్పు చేస్తే జైలు శిక్ష విధించవచ్చని అధికారులు తెలిపారు. కేవలం పోలీసు చర్యలు మాత్రమే కాకుండా.. ఈ సమస్య పరిష్కారానికి ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరం. ప్రతి ఒక్కరూ తమ ఇంటి చెత్తను రోడ్లపై వేయకుండా, చెత్త బుట్టలలో వేయాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి జీహెచ్ఎంసీ వాహనాలకు అప్పగించాలని అధికారులు కోరుతున్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, రీ సైక్లింగ్ ప్రక్రియను ప్రోత్సహించడం వంటి చర్యలు కూడా తీసుకోవాలని అంటున్నారు. పోలీసులు, జీహెచ్ ఎంసీ చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్ వల్ల నగరంలో పరిశుభ్రత పెరుగుతుందని, ప్రజలు బాధ్యతగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నారు.

# యువతి రాపిడో కష్టాలు..!

**'ఇలాంటి వెధవల వల్లే కష్టపడి పని చేసుకునే వారికి చెడ్డపేరు'..**

హైదరాబాద్: రాపిడో వంటి బైక్ ట్యాక్సీ డ్రైవర్లు నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు పాల్పడుతున్నారు. ప్రయాణికుల భద్రతను పణంగా పెడుతూ చాలా మంది డ్రైవర్లు బైక్ నడుపుతున్నప్పుడు ఫోన్‌లో మాట్లాడుతూ, మెసేజ్‌లు చూస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తాజాగా హైదరాబాద్ నగరానికి చెందిన ఒక యువతి రాపిడో సర్వీస్ గురించి, డ్రైవర్ నిర్లక్ష్యం గురించి ట్విట్టర్‌లో తన ఆవేదను పంచుకున్నారు. ఆమె చెప్పిన మాటలు రాపిడో వంటి టూ-వీలర్ క్యాబ్ సర్వీసులలోని భద్రతా లోపాలను, డ్రైవర్ల నిర్లక్ష్యాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. చాలామంది ప్రయాణికులు ఇలాంటి చేదు అనుభవాలను ఎదుర్కొంటున్నారు. 'ఈరోజు కాస్త ఒంట్లో బాలేదు. నా స్కూటీ ఇంట్లో పెట్టి.. రాపిడో బుక్ చేసుకున్నాను. నా కర్మ కొద్దీ ఇతను వచ్చాడు. అతనికి హెల్మెట్ లేదు, కేర్ లేదు. రాష్ డ్రైవింగ్, ఫోన్ మాట్లాడుతూ వెళ్తున్నాడు. రాంగ్ రూట్‌లో వెళ్లకండి.. యూ టర్న్ చేసుకోండి అంటే కోపంతో ఇంకా స్పీడ్‌గా వెళ్లాడు. మీరు ఎప్పుడైనా ఇలాంటి రాపిడో సర్వీస్ ఫేస్ చేసారా?' అంటూ రాసుకొచ్చింది.

రాపిడో సంస్థ నిర్దేశించిన నిబంధనల ప్రకారం డ్రైవర్, ప్రయాణికుడికి హెల్మెట్ తప్పనిసరి. కానీ చాలా మంది డ్రైవర్లు దీనిని పాటించడం లేదు. ఈ యువతి విషయంలో కూడా ఇదే జరిగింది. డ్రైవర్ హెల్మెట్ ధరించకపోవడమే కాకుండా.. ప్రయాణికురాలికి కూడా హెల్మెట్ ఇవ్వలేదు. ఇది భద్రతా ప్రమాణాల ఉల్లంఘన మాత్రమే కాదు, ప్రమాదాలకు దారితీసే నిర్లక్ష్యం కూడా. రాష్ డ్రైవింగ్, ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపడం, ప్రయాణికుల సూచనలను పట్టించుకోకపోవడం వంటివి డ్రైవర్ల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఈ యువతి విషయంలో డ్రైవర్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, సరైన మార్గంలో వెళ్లమని చెప్పినందుకు కోపంతో వేగం పెంచడం వంటివి మరింత దారుణం.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వకపోతే, రాపిడో సర్వీసులు విశ్వసనీయతను కోల్పోతాయి. ఈ సంఘటనపై సంస్థ స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి వెధవల వల్లే కష్టపడి రాపిడో నడుపుకునే వారికి చెడ్డపేరు వస్తుందని అంటున్నారు. రాపిడో లాంటి సంస్థలు భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా, డ్రైవర్లకు కఠినమైన నిబంధనలు విధించి, వాటిని తప్పనిసరిగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. లేకపోతే ప్రయాణికుల ప్రాణాలకే ప్రమాదం.

# అంబులెన్స్ వద్దకు వచ్చి న్యాయమూర్తి విచారణ..



ములుగు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడికి న్యాయస్థానం అండగా నిలిచి మానవీయతను చాటింది. జాతీయ లోక్ అదాలత్‌లో జరిగిన విచారణ సందర్భంగా.. బాధితుడి పరిస్థితిని అర్థం చేసుకున్న న్యాయమూర్తి నేరుగా అంబులెన్స్ వద్దకే వచ్చి విచారణ జరిపారు. ఈ కేసులో బాధితుడికి రూ.కోటి పరిహారం చెల్లించాలని బీమా సంస్థను ఆదేశించారు. వివరాల్లోకి వెళితే.. ములుగు జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన జాపతి దీక్షిత్ (22) బాచుపల్లిలో ఇంజినీరింగ్ రెండో ఏడాది చదువుకుంటున్నాడు. 2023 ఆగస్టు 12న స్నేహితులతో కలిసి అనంతగిరి హిల్స్‌కు విహారయాత్రకు వెళ్లగా.. మార్గ మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయమైంది. దీంతో అతడి శరీరం చచ్చుబడిపోయింది. సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన దీక్షిత్ తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, పద్మ తమ స్తోమతకు మించి సుమారు రూ.60 లక్షలు అప్పు చేసి అతడికి చికిత్స చేయించారు. ఈ క్రమంలో గో డిజిట్ ఇన్సూరెన్స్ సంస్థపై రూ.1.50 కోట్ల పరిహారం కోసం కేసు వేశారు. శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో ఈ కేసు విచారణకు వచ్చింది. బాధితుడు దీక్షిత్ తీవ్ర అనారోగ్యంతో కదల్లేని స్థితిలో అంబులెన్స్‌లో ఉన్నాడని తెలుసుకున్న న్యాయ సేవా సమితి చైర్‌పర్సన్, 12వ అదనపు చీఫ్ జడ్జి షౌకత్ జహాన్ సిద్దిఖీ ఏమాత్రం సంకోచించకుండా నేరుగా అంబులెన్స్ వద్దకే వెళ్లారు. అక్కడ దీక్షిత్ ఆరోగ్య పరిస్థితిని, అతడి తల్లిదండ్రుల బాధను స్వయంగా చూశారు. వారి ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్నారు.

న్యాయమూర్తి షౌకత్ జహాన్ సిద్దిఖీ మానవత్వాన్ని చాటుకున్నారు. బాధితుడికి తక్షణ సాయం అవసరాన్ని గుర్తించిన న్యాయమూర్తి.. నెల రోజుల్లోపు రూ.కోటి పరిహారాన్ని నేరుగా దీక్షిత్ బ్యాంకు ఖాతాలో జమ చేయాలని బీమా సంస్థను ఆదేశించారు. దీనికి బీమా సంస్థ ప్రతినిధులు కూడా అంగీకరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి చొరవను, మానవత్వాన్ని పలువురు కొనియాడారు. న్యాయం కేవలం కోర్టు గదుల్లోనే కాకుండా.. అవసరం ఉన్నచోట కూడా అందించవచ్చని న్యాయమూర్తి నిరూపించారు. ఈ తీర్పు దీక్షిత్ కుటుంబానికి గొప్ప ఊరటనిచ్చింది.

# పట్టాలెక్కిన హైదరాబాద్ టు యాదాద్రి ఎంఎంటీఎస్ ప్రాజెక్టు..

**రూ.20 టికెట్‌తో గంటలోపే చేరుకోవచ్చు..!**



హైదరాబాద్: ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి వెళ్లే భక్తుల కోసం రైల్వే శాఖ కీలక అడుగు వేసింది. హైదరాబాద్ టు యాదాద్రికి ఎంఎంటీఎస్ ఫేజ్-2 విస్తరణ ప్రాజెక్టును పట్టాలు ఎక్కించింది. సుమారు రూ.412 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టును 2028 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొదట హైదరాబాద్ శివారు ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు అనుకున్న ఈ ప్రాజెక్టును ఇప్పుడు వంగపల్లి వరకు పొడిగించారు. దీంతో ఈ మార్గం పొడవు 35 కిలోమీటర్ల నుంచి 41 కిలోమీటర్లకు పెరిగింది.

ఈ ప్రాజెక్టు కింద సిగ్నలింగ్, టెలికమ్యూనికేషన్, ఎలక్ట్రికల్, సివిల్ పనులను కాంట్రాక్టులకు అప్పగించారు. ఈ పనులను రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ సంస్థ పర్యవేక్షిస్తుంది. 2016-17లో ఈ ప్రాజెక్టుకు రూ.330 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు లభించింది. అప్పట్లో తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టు వ్యయంలో మూడింట రెండు వంతులు భరిస్తామని చెప్పినా, నిధులు విడుదల చేయడంలో జాప్యం జరిగింది. అయితే, గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం మొత్తం వ్యయాన్ని తానే భరిస్తుందని ప్రకటించింది. జాప్యం కారణంగా ఇప్పుడు వ్యయం రూ.412.26 కోట్లకు పెరిగింది.

మేడ్చల్-మల్కాజిగిరి, యాదాద్రి-భువనగిరి జిల్లాల్లో 18.62 హెక్టార్ల ప్రైవేటు భూమిని సేకరించాల్సి ఉంది. భూసేకరణ ప్రక్రియ కూడా తాజాగా మొదలైంది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి దశలో వంగపల్లి- యాదాద్రి (రాయగిరి)- భువనగిరి- పగిడిపల్లి మార్గాన్ని 2026-27 నాటికి పూర్తి చేయాలని యోచిస్తున్నారు. రెండో దశలో పగిడిపల్లి- బీబీనగర్- ఘట్‌కేసర్ మార్గాన్ని 2027-28 నాటికి పూర్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే యాదగిరిగుట్టకు వెళ్లే భక్తులకు ప్రయాణ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. హైదరాబాద్ నగరం నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రూ.20 టికెట్‌తో గంటలోపే చేరుకోవచ్చు.

# డిగ్రీ విద్యార్థిని హత్యాచార నిందితుడికి జీవిత ఖైదు..!

కరీంనగర్: డిసెంబర్ 16, 2012లో ఢిల్లీలో చోటు చేసుకున్న నిర్భయ సామూహిక అత్యాచార ఘటన దేశాన్ని కుదిపేసిన సంగతి తెలిసిందే. మహిళల భద్రత, చట్టాల గురించి దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలకు దారితీసింది. 23 ఏళ్ల ఫిజియోథెరపీ విద్యార్థిని ఆరుగురు వ్యక్తులు బస్సులోనే అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె స్నేహితుడిపై దాడి చేసి ఆ దారుణానికి ఒడిగట్టారు. 13 రోజుల పాటు ప్రాణాలతో పోరాడిన ఆమె.. ఆ తర్వాత ప్రాణాలు విడిచింది. కేసు ఘటన దేశవ్యాప్తంగా ప్రజలను ఆగ్రహానికి గురి చేసింది. ఈ ఘటన జరిగిన రెండ్రోజులకు అంటే డిసెంబర్ 18న అచ్చం అటువంటి ఘటనే అప్పటి ఉమ్మడి ఏపీ సిద్ధిపేటలో చోటు చేసుకుంది. డిగ్రీ చదువుతున్న ఓ విద్యార్థినిని గ్యాంగ్ రేప్ చేసి దారుణంగా హతమార్చారు. కరీంనగర్ ప్రాంతానికి చెందిన అఫ్సర్, నరేందర్, శ్రీనివాస్ అనే ముగ్గురు వ్యక్తులు ఈ ఘోరానికి పాల్పడ్డారు. అనంతరం పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకోగా.. ఛార్జ్‌షీట్ ఫైల్ చేశారు. సుదీర్ఘ న్యాయ పోరాటం అనంతరం ఈ ఘోరానికి పాల్పడిన కరీంనగర్‌కు చెందిన ముగ్గురు నిందితులలో ఒకడైన నరేందర్‌కు జీవిత ఖైదు పడింది. దాదాపు పన్నెండేళ్ల సుదీర్ఘ న్యాయ పోరాటం తర్వాత సెప్టెంబర్ 10, 2025న కోర్టు నరేందర్‌కు జీవిత ఖైదు విధించింది.



కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసును అణచివేయడానికి ప్రయత్నించిందని ఆరోపణలు వచ్చాయి. అప్పటి బీజేపీ కరీంనగర్ బీజేపీ అధ్యక్షుడు, కార్పొరేటర్, ప్రస్తుత కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఈ కేసును ప్రభుత్వం అణచివేస్తుందని తీవ్రంగా ఆరోపించారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరగాలని డిమాండ్ చేస్తూ పలు నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్భయ తరహా ఘటన జరిగితే కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. బాధితుల పక్షాన పోరాటం చేశారు. తాజాగా.. ఈ కేసులో నిందితుడిగా ఉన్న నరేందర్‌కు కోర్టు జీవిత ఖైదు విధించింది. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. బాధితురా లి కుటుంబానికి న్యాయం జరిగిందన్నారు. ఇది న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. ఈ తీర్పు ఇతర నేరస్తులకు ఒక హెచ్చరికగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కేసులో మిగిలిన నిందితులపై విచారణ కొనసాగుతుంది.

# పాత బస్తీ మెట్రోపై కీలక అప్డేట్..



హైదరాబాద్: పాతబస్తీ మెట్రో ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతి రాగానే టెండర్లు పిలిచేందుకు సిద్ధంగా ఉంది. నవంబర్ నాటికి అనుమతులు వస్తాయని అధికారులు ఆశిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పాతబస్తీ ప్రజల ప్రయాణ కష్టాలు తీరుతాయి. అయితే నిర్మాణానికి కనీసం రెండున్నరేళ్లు పట్టే అవకాశం ఉంది. మెట్రో అధికారులు నవంబర్ నాటికి అనుమతులు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కసరత్తును ఇప్పటికే పూర్తి చేశారు. పాతబస్తీ మెట్రో మార్గం హైదరాబాద్‌లో మెట్రో విస్తరణలో ఒక కీలక భాగంగా మారనుంది. కొత్తగా ప్రతిపాదించిన ఈ మెట్రో మార్గం ఇప్పటికే ఉన్న కారిడార్లకు పొడిగింపు కావడంతో కేంద్రం కొన్ని కీలక అంశాలపై వివరణ కోరింది.

ముఖ్యంగా తొలి దశ మెట్రోను నిర్వహిస్తున్న ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రోతో టికెటింగ్, ఆదాయం, నిర్వహణ ఎలా పంచుకుంటారనే అంశంపై కేంద్రం ప్రశ్నలు లేవనెత్తింది. నిర్మాణం పూర్తయిన తర్వాత నిర్వహణ సమస్య కాదని అధికారులు తెలిపారు. ఇప్పుడున్న ఎల్‌అండ్‌టీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించడమో, లేదా థర్డ్ పార్టీకి అప్పగించి ఆదాయాన్ని పంచుకోవడమో చేస్తామని వివరించారు. ఈ రెండు ఆప్షన్లలో రెండో దానికే ఎల్‌అండ్‌టీ మొగ్గు చూపుతోంది. ఒకవేళ స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి నిర్వహణ అప్పగించడానికి సిద్ధమని ఎల్‌అండ్‌టీ పేర్కొంది. ప్రస్తుత ప్రభుత్వం రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి పాతబస్తీ మెట్రో ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే అధికారుల అంచనా ప్రకారం ఈ పనుల పూర్తికి కనీసం రెండున్నరేళ్లు పట్టే అవకాశం ఉంది. సమయం తక్కువగా ఉండటం, పనులకు అవసరమైన 'రైట్ ఆఫ్ వే' (నిర్మాణానికి మార్గం) సిద్ధంగా ఉండటంతో టెండర్ల జారీకి అత్యవసరంగా చర్యలు తీసుకుంటున్నారు. కాగా, నష్టాల కారణంగా ప్రాజెక్టు నుంచి తప్పుకోవాలని ఎల్‌అండ్‌టీ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. రద్దీకి తగ్గ కోచ్‌లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని కేంద్రం వివరణ కోరింది. దీనిపై సంస్థ త్వరలో కొత్త కోచ్‌లను కొనుగోలు చేస్తామని బదులిచ్చింది.

మెట్రో రైలు సంస్థ కేంద్రం అడిగిన అన్ని వివరణలు ఇచ్చామని దీపావళి తర్వాత ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఒక శుభవార్త వినే అవకాశం ఉందని విశ్వాసం వ్యక్తం చేస్తోంది. పాతబస్తీ మెట్రో ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంత ప్రజల ప్రయాణ కష్టాలు చాలా వరకు తగ్గుతాయి.

# హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే..



తెలంగాణ: హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ నుంచి ఏపీ రాజధాని అమరావతికి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మించతల పెట్టిన విషయం తెలిసిందే. 12 వరుసలతో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మిస్తున్నారు. ఈ హైవే సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారీ బాధ్యతలను నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయానికి అప్పగించనున్నారు. ఈ రహదారి నిర్మాణానికి సంబంధించిన సిద్ధం చేయాలని ఇటీవల కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశించినట్లు సమాచారం.

ఈ ఎక్స్‌ప్రెస్ హైవే మొత్తం పొడవు సుమారు 210-230 కిలోమీటర్లు ఉండవచ్చని అంచనా వేస్తోంది. ఈ హైవే హైదరాబాద్- విజయవాడ హైవేకు సమాంతరంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలుపుతుంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే కిలోమీటర్‌కు సుమారు రూ.40 కోట్ల చొప్పున మొత్తం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.9 వేల కోట్లకు పైగా ఖర్చు అయ్యే అవకాశముందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం గూగుల్ మ్యాప్ ఆధారంగా అంచనా వేసిన అలైన్‌మెంట్‌పై పూర్తి స్థాయి సర్వే తర్వాత స్పష్టత వస్తుంది. ఇటీవల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ నుండి ఈ రహదారిని నిర్మించాలని కేంద్ర మంత్రి గడ్కరీని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు.

కేంద్రం నుంచి అనుమతులు రావడంతో ఎన్‌హెచ్ఏఐ త్వరలోనే తయారీకి కన్సల్టెన్సీని ఎంపిక చేసేందుకు బిడ్‌లను పిలవనుంది. ఎంపికైన కన్సల్టెన్సీ ఇచ్చే నివేదిక ఆధారంగానే తదుపరి టెండర్లకు వెళ్లే అవకాశం ఉంది. ఈ రహదారి నిర్మాణం ఏపీ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీల్లో ఒక భాగం కాగా.. ఈ ఎక్స్‌ప్రెస్ హైవే రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ప్రయాణ సమయాన్ని కూడా గణనీయంగా తగ్గిస్తుందని, ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ఫ్యూచర్ సిటీ నుంచి రంగారెడ్డి జిల్లా యాచారం, నల్గొండ జిల్లా చందూరు, మునుగోడు, సూర్యాపేట మీదుగా ఈ రహదారిని నిర్మించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సైతం సిద్ధం అయ్యాయి.

# ఈ జిల్లాల్లో కుండపోత వానలు..

తెలంగాణ: గత కొన్ని రోజులుగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. జూన్ నెలలో సాధారణ వర్షపాతం నమోదు కాగా.. ఆ తర్వాత జూలై చివరి వారం, ఆగస్టు, సెప్టెంబర్‌లో వర్షాలు దంచికొడుతున్నాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికల ప్రకారం.. రాష్ట్రానికి మరోసారి వర్షం హెచ్చరికలు జారీ అయ్యాయి. నేటి నుంచి నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో వర్షాలు కొనసాగే అవకాశముందని అధికారులు అంచనా వేశారు. నేడు కామారెడ్డి, సిరిసిల్ల, కరీంనగర్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. మిగిలిన జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది.

ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద రావడంతో నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల



ప్రాజెక్టుల గేట్లు తెరిచి నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 2.74 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండటంతో 26 గేట్లు ఎత్తి దిగువకు అదే మొత్తంలో నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 2.76 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా.. గేట్లు, విద్యుదుత్పత్తి, కాలువల ద్వారా 2.82 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టుకు 1.57 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా.. 1.63 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

వేగుచుక్క

# నా కుటుంబాన్ని నిలబెట్టారు సార్'..



తేజ సజ్జా, మంచు మనోజ్ ప్రధాన పాత్రల్లో నటించిన 'మిరాయ్' సినిమా శుక్రవారం వరల్డ్ వైడ్ గా గ్రాండ్ గా రిలీజ్ అయింది. ప్రమోషనల్ కంటెంట్ తోనే అందరి దృష్టిని ఆకర్షించిన ఈ ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్ మూవీ.. తొలి రోజే పాజిటివ్ టాక్ తో బాక్సాఫీస్ దగ్గర సత్తా చాటింది. ఫస్ట్ డే ప్రపంచ వ్యాప్తంగా రూ.27 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టినట్లు మేకర్స్ అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. ఈ నేపథ్యంలో చిత్ర బృందం నిర్వహించిన సక్సెస్ మీట్ లో మంచు మనోజ్ ఎమోషనల్ అయ్యారు.

మంచు మనోజ్ మాట్లాడుతూ.. "ఒక సక్సెస్ వేదిక మీద నిలబడినందుకు ఈరోజు నాకు చాలా హ్యాపీగా ఉంది. దాదాపు 10 – 12 ఏళ్ల తర్వాత నా ఫోన్ ఇలా మోగుతుంది. అందుకు డైరెక్టర్ కార్తీక్ కి థాంక్యూ. ప్రొడ్యూసర్ టీజీ విశ్వప్రసాద్ చెప్పినట్టు ఈ సినిమా అందరికీ చాలా ఇంపార్టెంట్. కాకపోతే వాళ్ళందరూ సినిమాల మీద సినిమా తీస్తున్నారు. నాకు నిన్నటి నుంచి అందరూ విషెస్ చెబుతుంటే నాకు కలలాగే ఉంది. దాన్ని తీసుకోడానికి నాకు టైం పట్టింది. కార్తీక్ ఏం ఆలోచించి ఈ కథ రాశారో, నాకోసం ఓ పాత్ర రాసుకొని నన్ను అడిగారు. అందుకు ఎన్ని జన్మలు ఎత్తినా అతనికి రుణబడి ఉంటాను" అని అన్నారు.

"అన్నా.. మిరాయ్ సినిమా నిన్ను ఎక్కడికో తీసుకెళ్తుంది' అని కార్తీక్ చెబుతూ ఉండేవాడు. ఇది చాలండి అని అప్పుడే చెప్పాను. నేను ఎప్పుడు ఏదో కొత్తగా ట్రై చేయాలని వెతుకుంటుంటాను. అంతకముందు సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా, ఎక్కడ కలిసినా 'అన్నా.. సినిమా ఎప్పుడు? కంబ్యాక్ ఇవ్వు మేము చూసుకుంటాం. నీకు హిట్ పడాలి. కంబ్యాక్ ఇవ్వు' అని అడుగుతుండేవారు. కంబ్యాక్ ఎప్పుడు అని అడిగినప్పుడల్లా 'వస్తున్నాను తమ్ముడు.. త్వరలో చేస్తాను' అని చెప్పేవాడిని. బయటికి ధైర్యంగా మాట్లాడుతున్నా, లోపల మాత్రం తెలియని భయం ఎప్పుడూ ఉండేది. చాలా సినిమాలు దగ్గర వరకు వచ్చి దూరమైపోతున్నాయి. అనుకుంది ఒకటయితే జరిగేది ఇంకొకటి. ఇలాంటి పరిస్థితుల్లో, సినిమాలు చేయకుండా ఏం చేయాలి అని ఆలోచిస్తున్న టైంలో కార్తీక్, తేజ, విశ్వప్రసాద్ నన్ను నమ్మి ఈ సినిమా చేశారు"

"కార్తీక్ లాంటి ఒక డైరెక్టర్ ని టెక్నీషియన్ నా లైఫ్ లో చూడలేదు. నేను దగ్గర నుంచి చూశాను. కార్తీక్.. నన్ను మాత్రమే నిలబెట్టలేదు.. నన్నూ నా కుటుంబాన్ని నిలబెట్టారు సార్. ఎప్పుడూ నాకు తెలియని ఒక భయం ఉండేది. ఇన్ని రోజులు ఎక్కడా చెప్పలేదు. నేను పెరిగినట్లుగా నా పిల్లల్ని పెంచగలుగుతానా? అలా చూసుకోగలుగుతానా? అని రోజూ నాకు ఒక చిన్న భయం ఉండేది. నాలో ఆ భయాన్ని చంపేశారు కార్తీక్ సార్. థాంక్యూ సో మచ్. నిజంగా దర్శకుడు చాలా కష్టపడ్డారు. మధ్యలో ఆయన డైరెక్టర్ గా ఒక సినిమా చేస్తే, దానికి మిక్స్ రివ్యూస్ వచ్చాయి. ఎన్ని కామెంట్స్ వచ్చినా లెక్క చేయకుండా అదే టీంతో సినిమా చేశారు. దానికి నిర్మాత విశ్వప్రసాద్ సపోర్ట్ చేస్తూ, దాని కంటే పెద్ద సినిమా చేయడం నిజంగా గ్రేట్. ఎంతో పెద్ద గుండె ఉంటే తప్ప అలా చేయరు" అంటూ మనోజ్ ఎమోషనల్ గా మాట్లాడారు.

# నాకు బట్టలు వేయడమేంటి

కామెడీ వీడియోలతో క్రేజ్ సంపాదిం చుకున్న యూట్యూబర్ మౌళి తనూజ్.. ఒ90స్ అనే వెబ్ సిరీస్ తో నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇప్పుడు 'లిటిల్ హార్ట్స్' సినిమాతో హీరోగా ప్రేక్షకులను పలకరించాడు. బిగ్ స్క్రీన్ మీద ఎంట్రీ ఇస్తూనే బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకున్నాడు. దీంతో మౌళి ఒక్కసారిగా టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారిపోయాడు. ఇప్పటికే పలువురు సెలబ్రిటీలు అతన్ని ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. మరికొందరు నేరుగా మౌళికి ఫోన్ చేసి కంగ్రాట్స్ చెప్పారు. తాజాగా హీరో విజయ్ దేవరకొండ ఈ మూవీ టీమ్ ని స్వయంగా తన ఇంటికి ఇన్వైట్ చేసి మరీ అభినందించారు. ఇటీవల 'లిటిల్ హార్ట్స్' సినిమా చూసిన విజయ్ దేవరకొండ చిత్రాన్ని బృందాన్ని అభినందిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. మూవీ ఘన విజయం సాధించడంతో, వారిని తన ఇంటికి పిలిచి శుభాకాంక్షలు తెలిపారు. విజయ్ ను కలిసిన వారిలో హీరో మౌళి తనూజ్, కమెడియన్ జయకృష్ణ, డైరెక్టర్ సాయి మార్తాండ్, డీవోపీ సూర్య బాలాజీ, మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి, ఇతర టీమ్ మెంబర్స్ ఉన్నారు. విజయ్ దేవరకొండకు కృతజ్ఞతలు చెబుతూ.. మౌళి ఈ ఫోటోలను ట్విట్టర్ ఎక్స్ లో పోస్ట్ చేశాడు. సోదరుడిలా విజయ్ దేవరకొండ తమపై చూపించిన ప్రేమ, ఆయన చెప్పిన మాటల్ని ఎప్పటికీ మర్చిపోలేమని మౌళి పేర్కొన్నాడు. ఈ సందర్భంగా ఓ ఇంట్రెస్టింగ్ వీడియోని పంచుకున్నాడు. ఇందులో 'లిటిల్ హార్ట్స్' బృందం విజయ్ ఇంటికి వెళ్లడం, ఆయనతో సరదాగా మాట్లాడటం వంటివి చూపించారు. అంతేకాదు దూరం నుంచి విజయ్ దేవరకొండ ఇంటిని చూపిస్తూ, తనను ఇంటికి బిర్యానీ తినడానికి రమ్మంటున్నాడని 2 ఏళ్ల క్రితం నాటి ఓ వీడియో క్లిప్ ని మౌళి జత చేశాడు. అప్పట్లో కామెడీ కోసం విజయ్ దేవరకొండ తనను బిర్యానీ తినడానికి ఇంటికి ఇన్వైట్ చేశాడని చెప్పగా.. సరిగ్గా రెండేళ్ల తర్వాత నిజంగానే ఈ సీన్ రిపీట్ అవడంతో మౌళి ఉబ్బితబ్బిబ్బవుతున్నాడు. విజయ్ స్వయంగా తనకు స్టైలింగ్ చేయడం ఏంటంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. "వారంలో అంతా మారిపోయింది. విజయ్ దేవరకొండ అన్న పర్సనల్ గా నాకు స్టైలింగ్ చేస్తాడని నా జీవితంలో ఎప్పుడూ ఊహించలేదు. లవ్ యు అన్నా. 'లిటిల్ హార్ట్స్' సినిమాకి సపోర్ట్ చేసిందనుకు ధన్యవాదాలు. 'రౌడీ' అవుట్ ఫిట్స్ బాగా నచ్చాయి" అని మౌళి రాసుకొచ్చాడు.



మౌళి షేర్ చేసిన వీడియోలో విజయ్ స్వయంగా మౌళి షర్ట్ సరిచేయడం, హ్యాండ్స్ ఫోల్డ్ చేయడం కనిపిస్తుంది. "విజయ్ దేవరకొండన్న నాకు బట్టలు వేయడమేంటి?.. వాట్ ఈజ్ దిస్?" అని మౌళి సంతోషంతో అంటాడు. చివర్లో వాళ్లకి నచ్చిన బట్టలు ప్యాక్ చేయండి అని విజయ్ అంటే.. మౌళి వాటి కాస్ట్ ఎంత ఉంటుందో అని రేట్ ట్యాగ్స్ చెక్ చేయగా, 'బిల్ ఏమి వేయడం లేదులేరా' అంటూ విజయ్ నవ్వించారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇది కదా నిజమైన సక్సెస్ అంటే అని నెటిజన్లు మౌళిని ప్రశంసిస్తున్నారు.

# మళ్లీ నిరాశే..

'అల్లుడు శ్రీను'తో పుష్కరం క్రితమే హీరోగా ఎంట్రీ ఇచ్చినా ఇండస్ట్రీలో నిలదొక్కుకునేందుకు దండయాత్ర చేస్తూనే ఉన్నాడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ఇటీవలే 'భైరవం'తో నిరాశ పరిచిన ఆయన తాజాగా ' కిష్కింధపురి 'తో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. ఈసారి ఎలాగైనా హిట్టు కొట్టాలన్న ఆశతో హారర్ థ్రిల్లర్ జోనర్ని సెలక్ట్ చేసుకున్న బెల్లంకొండ ఈ మూవీపై భారీ ఆశలు పెట్టుకున్నాడు. ఊహించినట్లుగానే టీజర్, ట్రైలర్లకి మంచి రెస్పాన్స్ రావడంతో ఈసారి బెల్లంకొండ శ్రీనివాస్కి హిట్టు పక్కా అని అందరూ ఫిక్స్ అయిపోయారు. థియేటర్లలోకి వెళ్లిన 10 నిమిషాల తర్వాత ప్రేక్షకులు ఫోన్ పట్టుకుంటే తాను ఇండస్ట్రీ నుంచి వెళ్లిపోతానని శ్రీనివాస్ ఇంటర్వ్యూలో చెప్పడం చూస్తే సినిమాపై ఆయనకున్న నమ్మకాన్ని తెలియజేసింది. షైన్ స్క్రీన్ బ్యానర్పై నిర్మాత సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రానికి 'చావు కబురు' చల్లగా మూవీ డైరెక్టర్ కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వం వహించారు. శుక్రవారం థియేటర్లలోకి వచ్చిన ఈ మూవీ మిక్స్డ్ టాక్ తెచ్చుకుంది. స్టోరీ బాగానే ఉన్నా దాన్ని నడిపించడంతో డైరెక్టర్ ఫెయిల్ అయ్యాడని, చివర్లో అనుపమ పరమేశ్వరన్ దెయ్యంగా మారే సీన్ తప్ప సినిమా మొత్తం బోర్గా ఉందని రివ్యూలు వచ్చాయి. అదేరోజు విడుదలైన 'మిరాయ్' బ్లాక్బస్టర్ టాక్ తెచ్చుకోవడం కూడా ఈ చిత్రానికి మైనస్గా మారింది.

టాక్కి తగినట్లుగానే 'కిష్కింధపురి'కి కలెక్షన్లు అంతంత మాత్రంగానే వచ్చాయి. తొలిరోజు రూ.4 కోట్ల గ్రాస్, రూ.2.5 కోట్ల నెట్ కలెక్షన్లు వచ్చినట్లు తెలుస్తోంది. ఇందులో నిర్మాతకి 40శాతం అంటే రూ.కోటి 60లక్షలు మాత్రమే వచ్చాయి. అయితే శని, ఆదివారాల్లో ఈ కలెక్షన్లు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మార్కెట్లో ప్రస్తుం మిరాయ్, కిష్కింధపురి తప్ప వేరే



సినిమాలు లేకపోవడం కలిసొచ్చేలా ఉంది. నటీనటులు, టెక్నీషియన్స్ రెమ్యునరేషన్, నిర్మాణం, ప్రమోషన్లు కలుపుకొని ఈ చిత్రానికి సుమారు రూ12 కోట్ల వరకు బడ్జెట్ అయినట్లు తెలుస్తోంది. టీజర్, ట్రైలర్కి మంచి రెస్పాన్స్ రావడంతో బిజినెస్ బాగానే జరిగింది. సినిమా మొత్తంగా రూ.25 కోట్ల గ్రాస్ వసూలు చేస్తే హిట్ జాబితాలో చేరుతుంది. అయితే తొలి రోజే కలెక్షన్లు నిరాశ పరచగా.. మిగతా రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# తేజ కెరీర్లోనే హయ్యెస్ట్ కలెక్షన్లు

ఎంతోకాలంగా ప్రేక్షకుల్ని ఊరిస్తూ వస్తోన్న డైవోషనల్ ఫాంటసీ అడ్వంచర్ మూవీ శుక్రవారం (సెప్టెంబర్ 12) థియేటర్లలో అడుగుపెట్టింది. ప్రీమియర్స్తోనే పాజిటివ్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం తొలిరోజు ముగిసేసరికి బ్లాక్బస్టర్ టాక్ సొంతం చేసుకుంది. సినిమాటోగ్రాఫర్ నుంచి డైరెక్టర్గా మారిన కార్తీక్ ఘట్టమనేని ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించాడని ప్రశంసలు వస్తున్నాయి. ఇక సూపర్ యోధగా తేజ సజ్జా పోరాటాలు, బ్లాక్స్వార్డ్గా మంచు మనోజ్ విలనిజం, శ్రియ, రితికా నాయక్ నటన బాగుందని, అన్నింటికీ కంటే ముఖ్యంగా వీఎఫ్ఎక్స్ వర్క్ అదిరిపోయిందని టాక్ వినిపిస్తోంది రామ్గోపాల్ వర్మ లాంటి వారైతే ఈ చిత్రం రూ.వెయ్యి కోట్ల క్లబ్లో చేరడం ఖాయమంటూ ఆశాకానికెత్తేస్తున్నారు.



ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉండటంతో అందుకు తగినట్లుగా అడ్వాన్స్ బుకింగ్స్లో జోరు చూపించింది. 'హనుమాన్' వంటి బ్లాక్బస్టర్ తర్వాత తేజ సజ్జా నుంచి వస్తోన్న చిత్రం కావడంతో అందరి కళ్లు దీనిపైనే ఉన్నాయి. ' మిరాయ్ ' చిత్రం తొలిరోజు ఇండియా వైడ్లో రూ.12 కోట్ల నెట్ వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించారు. ఇది తేజకి కెరీర్ హయ్యెస్ట్ ఫిగర్స్ కావడం విశేషం. గతంలో వచ్చిన 'హనుమాన్' తొలిరోజు ఇండియాలో రూ.8 కోట్ల నెట్ వసూలు చేసింది. సాక్నిల్క్ వెబ్సైట్ ప్రకారం.. 'మిరాయ్ చిత్రానికి శుక్రవారం తెలుగులో 68.59 శాతం, హిందీలో రూ.10.86 శాతం ఆక్యుపెన్సీ నమోదైంది. హిందీలో మార్నింగ్ షోలకు మరీ దారుణంగా 5.5 శాతం ఆక్యుపెన్సీ నమోదు కాగా.. పాజిటివ్ టాక్ రావడంతో సెకండ్ షోకి ఏకంగా 17 శాతానికి పెరగడం విశేషం. ఈ చిత్రం తెలుగులో రూ. 10.6 కోట్లు, హిందీలో రూ.1.25 కోట్లు, తమిళంలో రూ.5లక్షలు, మలయాళంలో రూ.5లక్షలు, కన్నడంలో రూ.5లక్షల నెట్ వసూళ్లు రాబట్టనట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. ఓవరాల్గా చూసుకుంటే ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం తొలిరోజు రూ.23-25 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు తెలుస్తోంది. నార్త్ అమెరికాలో తొలిరోజు రూ.7లక్షల డాలర్ల గ్రాస్ వసూలు చేసినట్లు మేకర్స్ అఫిషియల్ పోస్టర్ రిలీజ్ చేశారు.

కేవలం రూ.50 కోట్ల బడ్జెట్తో తెరకెక్కించిన ఈ చిత్రం ప్రేక్షకులతోనే కాకుండా విమర్శకులతో సైతం ప్రశంసలు అందుకుంటోంది. ముఖ్యంగా వీఎఫ్ఎక్స్ షాట్స్కి ఆడియన్స్ ఫిదా అయిపోతున్నారు. ఓ భారీ పక్షి కనిపించే సీన్స్కి అయితే విజిల్స్తో థియేటర్లు మార్మోగిపోతున్నాయి. తక్కువ బడ్జెట్తో ఇంత క్వాలిటీ అవుట్పుట్ ఇవ్వడం మామూలు విషయం కాదని, భారీ బడ్జెట్ చిత్రాలు తీసే దర్శక నిర్మాతలు, హీరోలు 'మిరాయ్' చూసి పాఠం నేర్చుకోవాలని ప్రేక్షకులు హితవు పలుకుతున్నారు. ఈ దూకుడు చూస్తుంటే ఫస్ట్ వీకెండ్లోనే బడ్జెట్ రికవరీ చేసేసి సోమవారం నుంచి లాభాల్లోకి వెళ్లేలా కనిపిస్తోంది. ఈ చిత్రంలో పాటే రిలీజైన 'కిష్కింధపురి' కూడా పాజిటివ్ టాక్ తెచ్చుకోవడంతో తెలుగు సినీ ఇండస్ట్రీలో చాలారోజుల తర్వాత పండగ వాతావరణం కనిపిస్తోంది. సెప్టెంబర్ 25న 'ఓజీ' వచ్చేవరకు మరే పెద్ద సినిమాలు లేకపోవడంతో ఈ రెండు చిత్రాలు రెండు వారాల బాక్సాఫీస్ని దున్నేసుకునే అవకాశం దక్కింది.

# బాహుబలి 2 రికార్డు బ్రేక్



సినిమాలో భారీ హంగులు, స్టార్ క్యాస్టింగ్ లేకపోయినా కంటెంట్ ఉంటే చాలు హిట్ చేస్తామని ఇటీవల కాలంలో ప్రేక్షకులు చాలాసార్లు నిరూపించారు. హీరో హీరోయిన్లు తెలియకపోయినా కథ నచ్చితే చాలు ఆడియన్స్ నెత్తిన పెట్టుకుంటున్నారు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ ఇటీవల వచ్చిన ' లోక చాప్టర్ 1 చంద్ర ' (తెలుగులో ' కొత్తలోక '). కేవలం రూ.30 కోట్ల బడ్జెట్తో తెరకెక్కించిన చిత్రం రెండు వారాలు ముగిసేసరికే రూ.200 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టి బ్లాక్బస్టర్గా నిలిచింది. ఇందులో మలయాళ బ్యూటీ కళ్యాణి ప్రియదర్శన్ అద్భుత శక్తులున్న యువతిగా కనిపించింది. హలో, చిత్రలహరి, రణరంగం చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ భామ ఇక్కడ పెద్దగా పేరు తెచ్చుకోలేకపోయింది. మలయాళ చిత్రం 'ఆంటోనీ'లో బాక్సర్గా కనిపించి మెప్పించింది. ఈ మూవీ తెలుగు వెర్షన్ ఓటీటీలో హిట్ అయింది. ఇండియాలోనే తొలి సూపర్ ఉమెన్ మూవీగా తెరకెక్కిన 'లోక చాప్టర్ 1 : చంద్ర' సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు క్రియేట్ చేస్తోంది. రిలీజైన 15 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్లు దాటిన ఈ చిత్రంలో మలయాళంలో అరుదైన రికార్డు క్రియేట్ చేసింది. రాజమౌళి, ప్రభాస్ కాంబినేషన్లో వచ్చిన 'బాహుబలి 2' కేరళలో రూ.73 కోట్లు వసూలు చేసింది. తాజాగా 'లోక చాప్టర్ 1: చంద్ర' మూవీ 15 రోజుల్లోనే మలయాళంలో 74.7 కోట్లు వసూలు చేసి 'బాహుబలి 2' రికార్డును దాటేసింది. సినిమాలో కంటెంట్ బలంగా ఉండటంతో బలమైన మౌత్ టాక్ సొంతం చేసుకుని భారీ కలెక్షన్లతో దూసుకుపోతోంది. 15వ రోజు కూడా ఈ చిత్రం రూ.3.85 కోట్లు రాబట్టిందంటే సినిమాకి ఎంతంటి ఆదరణ దక్కుతుందో అర్థం చేసుకోవచ్చు. కేరళలో అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రాల జాబితాలో ప్రస్తుతం నాలుగో స్థానంలో ఉన్న ఈ మూవీ నంబర్వన్ స్థానమే లక్ష్యంగా దూసుకుపోతోంది.

ప్రముఖ హీరో దుల్కర్ సల్మాన్ నిర్మాతగా వేఫేరర్ ఫిల్మ్స్ బ్యానర్పై నిర్మించిన ఈ చిత్రానికి డామినిక్ అరుణ్ దర్శకత్వం వహించారు. ప్రేమ, శక్తి, త్యాగం వంటి అంశాలను ఈ ఫాంటసీ డ్రామాలో అద్భుతంగా చూపించాడు డైరెక్టర్. తండ్రి కనిపించకపోవడంతో తన అసాధరణ శక్తులను కనుగొనే 'చంద్ర' పాత్రలో కళ్యాణి ప్రియదర్శన్ నటన విమర్శకుల ప్రశంసలు అందుకుంది. శాంతి బాలచంద్రన్ అందించిన స్క్రీన్ప్లే ఈ చిత్రానికి ప్రాణంగా నిలిచింది. సంప్రదాయ జానపద కథలను, ఆధునిక సూపర్ హీరో ఎలిమెంట్స్ని కలిపి తెరకెక్కిన ఈ చిత్రంలో కళ్యాణి ప్రియదర్శన్తో పాటు, నాస్లెన్, శాండీ, అరుణ్ కురియన్, చందు సలీంకుమార్ తదితరులు కీలకపాత్రల్లో నటించారు.

# ఆ స్టార్ హీరోతో నటించాలని ఉంది..



విశ్వక్సేన్తో 'అశోక వనంలో అర్జున కళ్యాణం' చిత్రంతో టాలీవుడ్లోకి ఎంట్రీ ఇచ్చింది ఢిల్లీ బ్యూటీ రితికా నాయక్ . ఆ తర్వాత 'హాయ్ నాన్న'తో చిన్న పాత్రతో మెరిసి ' మిరాయ్ 'తో ఛాన్స్ దక్కించుకుంది. తేజా సజ్జా హీరోగా నటించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలై బ్లాక్బస్టర్ టాక్ సొంతం చేసుకోవడంతో హీరోయిన్ రితికా నాయక్ ట్రెండ్లోకి వచ్చింది. దీంతో ఆమె కోసం నెటిజన్లు సెర్చ్ చేస్తున్నారు. ఫాంటసీ అడ్వంచర్గా తెరకెక్కిన ఈ చిత్రంలో కీలక పాత్రలో నటించడంతో ఆమెకు అవకాశాలు క్యూ కట్టడం ఖాయమని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇందులో హీరోతో రొమాన్స్ చేయడానికి వీల్లేకుండా పోయింది. మరోవైపు యూట్యూబ్లో ట్రెండ్ అయిన 'వైబ్ ఉంది బేబీ' సాంగ్ సినిమాలో కట్ చేయడంతో ఆమెతో పాటు ఆడియన్స్ కూడా ఫీలవుతున్నారు. ప్రస్తుతం ఈ బ్యూటీ వరుణ్ తేజ్ సరసన ఓ చిత్రంలో నటిస్తోంది. కొరియన్ హారర్ కామెడీ ఎంటర్టైనర్గా తెరకెక్కుతోన్న ఈ చిత్రం వరుణ్ తేజ్కి 15వ సినిమా కావడం విశేషం. దీంతో పాటు తమిళ బైలింగ్యువల్ ' 'నాకు అల్లు అర్జున్ అంటే చాలా ఇష్టం. నేను ఆయన ఫ్యాన్ని. తనతో నటించాలని ఎంతో ఆశగా ఉంది. అది హీరోయిన్గా అయినా సరే.. చిన్న పాత్ర అయినా సరే. బన్నీతో స్క్రీన్ షేర్ చేసుకోవాలనేది నా కోరిక. అలాంటి అవకాశమొస్తే అస్సలు వదులుకోను' అంటూ తన మనసులోని మాట బయటపెట్టేసింది ఈ బ్యూటీ. దీంతో అప్పుడే నెటిజన్లు బన్నీ, రితికా కాంబోని ఊహించేసుకుంటూ పోస్టులు పెట్టేస్తున్నారు. 'మిరాయ్' బ్లాక్బస్టర్ హిట్ని ఖాతాలో వేసుకున్న రితికా అందంతో పాటు అభినయంలో కూడా మంచి మార్కులే కొట్టేసింది. అసలు 'అశోకవనంలో అర్జున కళ్యాణం'లో ఈమెను చూసి చాలామంది అచ్చ తెలుగు అమ్మాయేమో అని అనుకున్నారు. తన చిలిపితనం, అల్లరితో ఆ చిత్రంలో అంతలా ఆకట్టుకుంది. 'మిరాయ్' హిట్లో లక్కీ హీరోయిన్గా మారడంతో త్వరలోనే ఆమె కోరిక నెరవేరవచ్చని కొందరు అంటున్నారు. మొత్తంమీద ఈ బ్యూటీ పెద్ద ప్లానింగ్ మీదే ఉందని కామెంట్లు చేస్తున్నారు.

# ఓజీ అప్డేట్ ఇచ్చిన డీజే టిల్లు బ్యూటీ..



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, డైరెక్టర్ సుజీత్ కాంబినేషన్లో వస్తున్న 'ఓజీ' చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. దసరాకు విడుదల కానున్న ఈ సినిమాని డీవీవీ దానయ్య భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన టీజర్, సాంగ్స్, పోస్టర్లు ఫ్యాన్స్ ను విపరీతంగా ఆకట్టుకున్నాయి. విజయ దశమి కానుకగా సెప్టెంబర్ 25న ఈ గ్యాంగ్ స్టర్ డ్రామా ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా 'డీజే టిల్లు' బ్యూటీ కీలక అప్డేట్ ఇచ్చింది.

'ఓజీ' సినిమా నుంచి ఇప్పటి వరకూ రిలీజ్ చేసిన ప్రమోషనల్ మెటీరియల్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. 'హంగ్రీ చీతా' బ్యాగ్రౌండ్ మ్యూజిక్.. 'ఫైర్ స్టార్మ్', 'సువ్వి సువ్వి' పాటలు ఆకట్టుకున్నాయి. ఈసారి విడుదల చేసే సాంగ్, వాటిని మించి ఉండాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఈ సినిమాలో ఒక ఐటెం సాంగ్ ఉంటుందని చాలా రోజులుగా ప్రచారం జరుగుతోంది. దీంట్లో టాలీవుడ్ యంగ్ బ్యూటీ నేహా శెట్టి ఐటెం భామగా కనిపించనున్నారని, ఆమె ప్రత్యేక పాత్రలో కనిపించనుందని టాక్ వచ్చింది. ఈ విషయాన్ని తాజాగా నేహా కన్ఫార్మ్ చేసింది.